

# వీసా

-మీర్ మహది అలి

కాలింగ్ బెల్ మోగుతుంటే విసుగ్గా తలుపు తెరిచాడు భూషణం. అతని సుపుత్రుని స్నేహితుడు ప్రభాకర్ ఎదురుగా కనిపించాడు.

'సురేష్ బయటే ఉన్నాడు' ఇక నువ్వెళ్లొచ్చు అనే అర్థం స్ఫురించేట్టు అన్నాడు.

'మీతో మాట్లాడుదామని వచ్చాను' ప్రభాకర్ వినయంగా అన్నాడు.

'నాతో ఏం పనీ?'

'సురేష్‌కు ఉద్యోగావకాశం ఉంది. దాని గురించి మీతో మాట్లాడాలని వచ్చాను...'

'ఇంటర్ నాలుగుసార్లు తప్పిన వాడికి ఎవడయ్యా జాబ్ ఇచ్చేది. నువ్వు దయచేస్తే లెక్కలు చూసుకుంటాను' చిరాగ్గా అని తలుపు వేయబోయాడు.

'అంకుల్! నే చెప్పేది పూర్తిగా వినండి. దుబాయి వీసా రెడీగా ఉంది' ఆత్రంగా అన్నాడు.

దుబాయి అనేసరికి భూషణానికి చిరు ఆశ కలిగింది. ముభావంగా ప్రభాకర్ ముఖం చూశాడు.

'నాకు తెలిసిన ఓ ఏజెంట్‌కు మా ఇద్దరి గురించి చెప్పి ఉంచాను... రెండు వీసాలు రెడీగా ఉన్నాయి. నేనెలాగో పోతున్నాను. వీడిని కూడా దుబాయి తీసుకెళ్ళాలని నా కోరిక'

భూషణం కొన్ని క్షణాలేదో ఆలోచించి 'లోనికి రా మాట్లాడుకుందాం' అని తన గదిలోనికి దారి తీశాడు.

ఇద్దరూ గదిలో కూర్చున్నారు.

'ఆ... ఇప్పుడు వివరంగా చెప్పు'

అందాక దుబాయి గురించి చెప్పింది ప్రభాకర్ మళ్ళీ చెప్పాడు.

'మీ ఇద్దరికీ చదువు లేదు. కనీసం టెక్నికల్ హ్యాండ్స్ కారు. అలాంటిది దుబాయిలో ఏం చేస్తారు' అపనమ్మకంగా అడిగాడు.

'అక్కడుంది టెక్నికల్ పోస్ట్ కాదు... కేవలం గ్రాడ్యుయేషన్ ఉంటే చాలు. నెలకు ఇండియన్ కరెన్సీలో అయితే పదిహేను వేలు దొరుకుతుంది' ఉత్సాహంగా అన్నాడు.

'మీరిద్దరూ ఇంటర్ ఫెయిలన్న సంగతి మరిచావా?' అసహనంగా అన్నాడు.

'అది మనకు మాత్రం తెలుసు. దుబాయిలో తెలియదు కదా' నర్మగర్భంగా అన్నాడు.

'అంటే?' విస్తుబోయి అడిగాడు.

'ఓ వేయి రూపాయలు పక్కన పెట్టండి. అన్ని సందేహాలూ దూరమవుతాయి' తేలిగ్గా అన్నాడు.

'వేయి రూపాయలు దేనికి' అనుమానంగా అన్నాడు.

'అయితే వినండి. ఓల్డ్ సిటీలో నా ఫ్రెండొకడున్నాడు. వాడికి దొంగ సర్టిఫికెట్లు అమ్మేవారి గురించి తెలుసు. వేయి రూపాయలు మనవి కాదనుకుంటే ఇండియాలోని ఏ యూనివర్సిటీ డిగ్రీ అయినా దొరుకుతుంది'

'ఎంక్వయిరీ అయిందంటే నువ్వా ఎలాగో జైలుకు పోతావు. పోతూపోతూ మా వాణ్ణి కూడా తీసుకువెళతావు' కోపంగా అన్నాడు.

ప్రభాకర్ పకపక నవ్వాడు.

'ఎందుకా నవ్వు' చిరాగ్గా అన్నాడు.

'నవ్వక ఏం చేయనూ?... అసలు మీకు బాకీలు ఇవ్వడం వడ్డీలు వసూలు చేయడం తప్పా ప్రపంచం తెలియడం లేదు'

'నా వ్యాపారం గురించి నీకెందుకు గానీ... ఎందుకు నవ్వుతున్నావో చెప్పు లేదా దయచేయ్' అసహనంగా అన్నాడు.

''కోపగించుకోకండి అంకుల్. శాంతంగా వినండి... ఇండియాలో ఉద్యోగం అయితే అన్నీ ఎంక్వయిరీలుంటాయి. సౌదీలో, దుబాయిలో ఇవన్నీ ఎవ్వరూ పట్టించుకోరు... వైద్యం తెలియని వాడు డాక్టర్ సర్టిఫికెట్‌తో పోతే ప్రాబ్లం కాని, మేం వెళ్ళాలనుకున్న పనికి చదువు పెద్దగా అవసరం లేదు. కాకపోతే ఇంగ్లీష్ తెలిసి ఉండాలనీ గ్రాడ్యుయేషన్ అర్హతగా పెట్టారు. మేం ఇంటర్ ఫెయిలయినా, ఇంగ్లీష్ పరిజ్ఞానం చాలా ఉంది. అందుకే ఎవ్వరికీ అనుమానం కలగకుండా జాబ్ చేయవచ్చు. తద్వారా కొన్ని సంవత్సరాలకు లక్షలు సంపాదించవచ్చు.'

ఆ మాటలు భూషణానికి ఊరటనిచ్చాయి. ఆలోచిస్తుంటే ప్రభాకర్ మాటల్లో అపనమ్మకం ఏదీ కనిపించలేదు.

ప్రభాకర్ ఇంకేమో చెప్పబోతుంటే అడ్డుపడుతూ అన్నాడు 'ఇప్పటివరకు ఆ సర్టిఫికెట్లతో ఎవరయినా విదేశాలకు వెళ్ళారా?'

'చాలా మంది వెళ్ళారు. లక్షలు సంపాదించుకుని వచ్చారు. ఇంకా చాలామంది వెడుతున్నారు కూడా... ఆ విషయంలో అనుమానం వద్దంకుల్. రిస్క్ ఉంటే నేనెందుకు వెళ్ళాలనుకుంటాను' తేలిగ్గా అన్నాడు.

భూషణం మళ్ళీ ఆలోచనల్లో పడ్డాడు.

'మరీ అంతగా ఆలోచించాల్సిన అవసరం లేదు. మా ఇంటర్ చదువులకు ఇండియాలో ఎలాగో ఉద్యోగం దొరకదు... వడ్డీల్లో చాలా సంపాదించగలను అని మీకు నమ్మకం ఉంటే పోనీయండి. కానీ ఈ రోజుల్లో మీ వ్యాపారానికి కూడా భద్రత లేదు. ఎవడో బంగారం తాకట్టు పెడితే మీరు డబ్బులు ఇస్తారు. కొన్ని రోజుల్లో పోలీసులు వచ్చి అది దొంగ బంగారం అనీ, అది కొనడం, తాకట్టు పెట్టడం నేరమనీ మిమ్మల్ని వేధిస్తారు. మీకు అన్ని విద్యలు తెలుసు కాబట్టి మీరెలాగో బయటపడతారు. కానీ భవిష్యత్తులో మీ కొడుకు ఇలాంటి రిస్క్ వ్యాపారమే చేయాల్సి ఉంటుంది'

ఆ మాటలకు భూషణం బుర్ర వేడెక్కి పోయింది.

'దుబాయి వెళ్ళడానికి ఎంత ఖర్చు అవుతుంది' ఆత్రంగా అడిగాడు.

'ప్లేన్ టిక్కెట్టూ అవీ అన్నీ కలుపుకొని ఎనభై వేలు అవుతుంది'

'ఎనభై వేలా' నోరు తెరుచుకుని అన్నాడు. క్షణంలోనే ఏదో ఆలోచించి 'ఇంత పెట్టుబడి నేను పెట్టలేను' అన్నాడు.

ప్రభాకర్ వదనం పాలిపోయింది.

'పూర్తిగా వినండి అంకుల్... సురేష్ ఒక్కడికి యాభై వేలే అవుతుంది'

'మరిందాక ఎనభై వేలన్నావ్' తీక్షణంగా అన్నాడు.

'మీరు పూర్తిగా వినలేదు. వాడి వీసాకు యాభై వేలు... ఇంకో ముప్పై వేలు నాకు అప్పుగా కావాలి' ఆత్రంగా, ఆశగా అన్నాడు.

భూషణానికి సర్రున కోపం వచ్చింది.

'నీ ముప్పై వేలు అప్పు కోసమా నాయనా? మా వాడి కోసం ఇంత ఉపకారం చేస్తున్నావ్' వ్యంగ్యంగా అన్నాడు.

'రెండు వీసాలున్నాయని ఇద్దరి కోసం ప్రయత్నిస్తున్నాను. అంతేగానీ ఉపకారం లాంటి పెద్ద మాటలెందుకు అంకుల్' శుష్కంగా అన్నాడు.

'ఒకే వీసా ఉంటే నాకు చెప్పేవాడివా?'

'ముందుగా నా కోసం ప్రయత్నించేవాడిని... మా ఇంటి పరిస్థితి మీకు తెలియందేముంది?... నాకు డబ్బు సర్దుబాటు కాకుండా ఉంటే సురేష్ కోసమే వీసా ఇప్పించేవాణ్ణి' నిజాయితీగా అన్నాడు.

అతని మాటల్లోని నిజాయితీ భూషణానికి అర్థం అయింది. మళ్ళీ ఆలోచనల్లో పడ్డాడు.

'మా అమ్మ నగలు మీ దగ్గరే పెడతాను. కాని అవి ఇరవై వేల వరకే సరిపోతాయి... అందుకే మరో ముప్ఫైవేలు అప్పుగా అడుగుతున్నాను'

'డబ్బు సర్దుబాటు కాకుంటే నువ్వు వెళ్ళవా?' భూషణం ఎందుకడిగాడో అతనికే తెలుసు.

'ఎలా వెళ్ళగలనూ? నా బ్యాడ్‌లక్ అనుకొని సురేష్ కోసమే ప్రయత్నిస్తాను'

'డబ్బు నేనిస్తే ఎన్నాళ్ళకు తీరుస్తావు'

'మీ అప్పు తీరేవరకు ఇంటికేం పంపించను'

'నీ మాటల్ని నమ్మమంటావా?'

'దుబాయిలో సురేష్ నాతోనే ఉంటాడుగా. ఇంకా అపనమ్మకం ఏముంది'

'ఏజెంట్ నమ్మకమైన వాడేనా?'

'సురేష్‌కి కూడా స్నేహితుడే. చాలా నమ్మకమైన వ్యక్తి'

భూషణం మాటలు ప్రభాకర్‌కు ఆశలు కల్పించాయి.

'సరే! నా సందేహం అంతా ఆ నకిలీ సర్టిఫికెట్ల గురించే...'

'సందేహం అనవసరం. నా ఫ్రెండ్‌కు అతను మంచి ఫ్రెండ్'

'ఏం పేరు? ఎక్కడుంటాడు?'

'కరీం అని ఓల్డ్‌సిటీలో ఉంటాడు'

'దుబాయి వెళ్ళాలన్నా ఉత్సాహంతో కాదు, నిజంగా ఆలోచించు నకిలీ సర్టిఫికెట్లతో ప్రాబ్లం ఏమీ లేదు కదా' సంశయంగా అడిగాడు.

'నిజంగా ఏం ప్రాబ్లం లేదు. మా ఫ్రెండ్ వాళ్ల అన్నయ్య ఎనిమిది సంవత్సరాలుగా అలాటి సర్టిఫికెట్‌తో దుబాయిలో జాబ్ చేస్తున్నాడు' నమ్మకంగా అన్నాడు.

'సరే ముందు సర్టిఫికెట్లు సంపాదించు... వేయి రూపాయలన్నావుగా! రెండింటికా? ఒక్కదానికా?'

'ఒక్కదానికే! మీరు వెయ్యి ఇవ్వండి చాలు. నా సర్టిఫికెట్ నేను కొనుక్కోగలను'

భూషణం వెయ్యి రూపాయలు నాలుగుసార్లు లెక్కపెట్టి ప్రభాకర్‌కు ఇచ్చాడు.

ప్రభాకర్ వెళ్ళిన గంట తరువాత సురేష్ ఇంటికి వచ్చాడు. భూషణం కొడుకుతో దుబాయి గురించి డిస్కస్ చేశాడు. సురేష్ అచ్చం ప్రభాకర్‌లాగే ధైర్యం కలిగించాడు.

భూషణం కొడుకును అడిగి దుబాయికి పంపే ఏజెంట్ చిరునామా తెలుసుకున్నాడు. ఆ రాత్రి చాలాసేపు ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాడు.

అతనికెందుకో తన కొడుకుతోబాటూ ప్రభాకర్ దుబాయి వెళ్ళడం ఇష్టం అనిపించడంలేదు. బాకీ తీర్చడేమో అనే భయం కాదు. ఒకేసారి రెండు నకిలీ సర్టిఫికెట్లతో ప్రాబ్లం వస్తుందేమోనని అతని భయం. ప్రభాకర్‌ను వెళ్ళనీయకుండా అడ్డు పడితే బాగుండు ననిపించసాగింది. ముప్ఫైవేలు ఇవ్వకుండా ఆపగలడు కానీ సురేష్ స్నేహితుని కోసం పట్టుబడతాడు... వేరే దారిలో ప్రభాకర్‌ను అడ్డుకోవాలని ఆలోచిస్తుంటే ఏజెంట్ జ్ఞాపకం వచ్చాడు. ఆ తరువాతే చెడు నిర్ణయానికొచ్చి సుఖంగా నిద్రపోయాడు.

ఆ తరువాత పనులన్నీ వేగంగా నడిచాయి. ప్రభాకర్ రెండు బి.ఎ. నకిలీ సర్టిఫికెట్లు తెచ్చాడు. పాస్‌పోర్ట్, సర్టిఫికెట్లు తీసుకొని స్నేహితులిద్దరూ ఏజెంట్ ఆఫీసుకు వెళ్ళారు. భూషణం కూడా ఆ ఇద్దరితో కలిసి వెళ్ళాడు. అతనా ఆఫీసుకు వెళ్ళడం ఆ వారంలో రెండవసారి.

మొదటిసారి వెళ్ళినప్పుడు ఏజెంట్‌తో పర్సనల్‌గా మాట్లాడి రెండు సర్టిఫికెట్ల గురించిన తన భయం చెప్పి, ఆ తరువాత తన పథకం చెప్పి, దాన్ని ఆచరణలోకి తెచ్చేందుకు వాడికి ఐదువేలు లంచం కూడా ఇచ్చి వచ్చాడు.

స్నేహితులిద్దరినీ ప్రోత్సాహపరుస్తూ రెండవసారి వాళ్లతోబాటూ ఏజెంట్ ఆఫీసులో అడుగుపెట్టాడు.

ఆ ఏజెంట్ వాళ్లని సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టాడు. పది నిమిషాల అనంతరం చిన్న బాంబు లాంటి వార్త పేల్చాడు.

'చూడండి భూషణంగారు. ఇలా చెప్పాల్సి వస్తుందని నాకు బాధగా ఉంది. నా దగ్గర దుబాయి రెండు వీసాలుండేవి. కానీ ప్రస్తుతం ఒక్కటే మిగిలింది'

స్నేహితులిద్దరూ ఖంగుతిన్నారు.

'నాకు రెండు వీసాలు చూపిచావు కదా' ప్రభాకర్ కోపంగా గద్దించాడు.



'అన్ని వివరాలు నీకెందుకుగానీ, నకిలీ సర్టిఫికెట్లు అమ్మే కరీం పోలీసులకు పట్టుబడ్డాడు. మా ట్రీట్‌మెంట్ తర్వాత ప్రభాకర్ సురేష్‌లకు సర్టిఫికెట్లు అమ్మిన విషయం చెప్పాడు. మా వాళ్లు ఇద్దరు ప్రభాకర్ కోసం వెళ్ళారు. మేం ఇక్కడికి వచ్చాం... సరే వాడైతే దుబాయిలో ఉన్నాడన్నావ్ కదా! వాడినెలాగో తీసుకువస్తాం. అందాక జైలులో నువ్వుండు రా'

'నిజమే బ్రదర్!... నిన్న రాత్రే దుబాయిలోని మా ఓనర్ ఫోన్ చేసి ఒక వీసా కేన్సల్ అయిందని చెప్పాడు. ఓ నెల లోపు ఇంకో వీసా పంపిస్తానన్నాడు' ఏజెంట్ విచారంగా ముఖం పెట్టాడు.

ప్రభాకర్ ఉత్సాహమంతా ఆవిరై పోయింది.

'ఇప్పుడు మీలో ఎవరైనా ఒకరు వెళ్లండి. ఓ నెల తరువాత ఇంకొకరిని ఖచ్చితంగా పంపిస్తాను'

ప్రభాకర్ నిస్సహాయంగా తలవంచుకున్నాడు.

భూషణం ఏజెంట్ ముఖాలు చూసుకొని నర్మగర్భంగా నవ్వుకున్నారు.

అరగంట తరువాత వాళ్లందరూ ఓ నిర్ణయానికి వచ్చారు. ఆ వారంలో ముందుగా సురేష్ దుబాయి వెడతాడు. ఆ తరువాత నెలలోపునే ప్రభాకర్‌కు కూడా అవకాశం కల్పించబడుతుంది.

భూషణం ఇంటికి వస్తూ ప్రభాకర్‌ను అనునయించాడు. అభయమిచ్చాడు.

ఆ వారంలోనే సురేష్ దుబాయి వెళ్ళాడు, నకిలీ సర్టిఫికెట్‌తో!

ఓ నెల గడిచాక ప్రభాకర్ ఏజెంట్ ఆఫీసుకు వీసా ఎంక్వయిరీ గురించి వెళ్ళి, అరగంట గడిపి పాలిపోయిన ముఖంతో వచ్చేశాడు. ఇది జరిగాక పదిరోజులకు ఓ సంఘటన జరిగింది.

కాలింగ్ బెల్ అదే పనిగా మోగుతుంటే భూషణం ఆత్రంగా తలుపులు తెరిచాడు. ఓ గంట క్రితమే దుబాయి నుండి సురేష్ ఫోన్ చేసి చెప్పాడు. రెండు మూడు రోజుల్లో ఒకతను వచ్చి నీకు పదిహేను వేలు ఇస్తాడు. హుండీ ద్వారా పంపిస్తున్నాను అని. హుండీ ఏమిటో అతనికి అర్థం కాకపోయినా సరే డబ్బులయితే వస్తున్నాయి కదా అనుకున్నాడు. డబ్బు తెచ్చిన వ్యక్తే బెల్‌కొట్టి ఉంటాడనుకుంటూ తలుపులు తెరిచి చూశాడు.

బయట ఇద్దరు అపరిచిత వ్యక్తులు కనిపించారు.

'మాది పోలీస్ డిపార్ట్‌మెంట్. క్రైం బ్రాంచ్ నుండి వచ్చాం' భూషణాన్ని పరీక్షగా చూస్తూ ఒకతను అన్నాడు.

భూషణం గుండె ఓ క్షణం ఆగి తిరిగి కొట్టుకోసాగింది.

'సురేష్ నీకు ఏమవుతాడు' రెండో అతను ఇంట్లోకి తొంగి చూస్తూ అన్నాడు.

'కొడుకవుతాడు. ఎందుకండీ' కంగారుగా, భయంగా అడిగాడు.

'పద లోనికి వెళ్ళి మాట్లాడుదాం' అని అతన్ని దాటుకొని ఇద్దరూ ఇంట్లోకి ప్రవేశించారు.

భూషణానికి చెమట్లు పట్టేశాయి.

'ఏమండీ మీరు విషయం చెప్పడం లేదు'

'ఇక్కడే వింటావా, పోలీసుస్టేషన్‌లో వింటావా' ఒకతను దర్పంగా అన్నాడు.

'పోలీసుస్టేషన్ ఎందుకండీ?' భయంగా అడిగాడు.

'సరే ఇక్కడే చెబుతాం... సురేష్ సౌదీకి వెళ్ళాడా?'

'అవునండి'

'అన్ని వివరాలు నీకెందుకుగానీ, నకిలీ సర్టిఫికెట్లు అమ్మే కరీం పోలీసులకు పట్టుబడ్డాడు. మా ట్రీట్‌మెంట్ తర్వాత ప్రభాకర్ సురేష్‌లకు సర్టిఫికెట్లు అమ్మిన విషయం చెప్పాడు. మా వాళ్లు ఇద్దరు ప్రభాకర్ కోసం వెళ్ళారు. మేం ఇక్కడికి వచ్చాం... సరే వాడైతే దుబాయిలో ఉన్నాడన్నావ్ కదా! వాడినెలాగో తీసుకువస్తాం. అందాక జైలులో నువ్వుండు రా' అని ఒకతను భూషణం చేయి పట్టుకున్నాడు.

భూషణం అమాంతం వాళ్ల కాళ్ల మీద పడిపోయాడు.

'రక్షించండి సార్' గద్గదంగా అరవసాగాడు.

'నువ్వైతే ముందు లేచి నిలబడు. రక్షింపబడే ఉపాయం మేం చెబుతాం'

అరగంట తరువాత ఆ ఇద్దరు యాభై వేలు లంచంగా తీసుకుని బయటికి నడిచారు. అక్కడి నుండి సరాసరి ఓ హోటల్‌కు వచ్చి ప్రభాకర్‌ను కలిశారు.

'ఒరేయ్ ప్రభూ నిన్ను మోసం చేసినందుకు వాడికి తగిన శాస్తి చేసి పరిహారంగా యాభై తీసుకొచ్చాం. నువ్వు దుబాయికి వెళ్ళడానికి అవసరమైన ముప్ఫై తీసుకో! ఇరవై మేం ఉంచుకుంటాం' నవ్వుతూ అన్నాడు.

'మీ మేలు జన్మలో మర్చిపోలేనురా' మనస్ఫూర్తిగా అన్నాడు.

'మాతోపాటూ ఆ మాట ఏజెంట్‌కు కూడా చెప్పాలి'

'ఇప్పుడు అక్కడికే వెళతాను... నాపై సానుభూతితో జరిగిన విషయం ఏజెంట్ చెప్పాడు. నిజంగా అతనికి రుణపడి ఉన్నాను'

'సరే మా రహస్యం కూడా బయటపడకుండా జాగ్రత్తగా డీల్ చెయ్' అని ముప్ఫైవేలు ప్రభాకర్‌కు ఇచ్చే వాళ్లు వెళ్ళిపోయారు.

ఆ డబ్బుల్ని ప్రభాకర్ తృప్తిగా జేబులో పెట్టుకుని ఏజెంట్ ఆఫీసు వైపు నడిచాడు.

★